సంపుటి : 9
సంచిక : 331
ఆదివారం
23 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

ఆయుర్వేద చికిత్స కోసం

## కేరళ చేరుకున్న పవన్ కల్యాణ్



**కేరళ, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేరళ చేరుకున్నారు. ఇటీవల ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న తన కుడి భుజానికి తదుపరి చికిత్సలో భాగంగా ఆయన ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయించారు. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా త్రిస్సూర్ బయలుదేరి వెళ్లారు. త్రిస్సూర్ సమీపంలో ఉన్న ఒక ప్రముఖ ఆయుర్వేద వైద్యశాలలో పవన్ కల్యాణ్ చేరారు. అక్కడ ప్రత్యేక థెరపీ ద్వారా ఆయనకు చికిత్స అందించనున్నారు. కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతున్న పవన్ కల్యాణ్ కు ఇటీవలే శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా, పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఆయన ఈ ఆయుర్వేద చికిత్స మిగతా .. 2లో..

ఇంటింటా నెట్ జీరో..

# ఆదర్శ గ్రామాలే లక్ష్యం

ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం
అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**మాడుగుల, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చి... గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెట్‌జీరో గ్రామాల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇంటి స్థాయి నుంచి కాలనీ, గ్రామ స్థాయి వరకు పర్యావరణహిత విధానాలను అమలు చేస్తూ.. క్రమంగా గ్రామాలను నెట్‌జీరో కమ్యూనిటీలుగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నెట్‌జీరో కార్యక్రమాలను పరిశీలించారు. నెట్‌జీరో గ్రామంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, సాధిస్తున్న లక్ష్యాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ, మురుగునీటి నిర్వహణ వంటి చర్యల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు మిగతా .. 2లో..



డీఎస్సీపై చర్చకు రా..

## టైమ్, డేట్ నీ ఇష్టం!

జగన్‌కు నారా లోకేశ్ ఐదోసారి సవాల్
విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం
వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి నో ఎంట్రీ అని స్పష్టం చేసిన లోకేశ్
త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు



**విజయనగరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీ నియామకాలపై చర్చకు రావాలంటూ వైసీపీ అధినేత జగన్ కు తాను ఐదోసారి సవాల్ విసురుతున్నానని, దమ్ముంటే చర్చకు రావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. "టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం కాదు, బయటకు రా!" అని లోకేశ్ తీవ్ర స్వరంతో జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని ఆయన ఎద్దేవా చేశారు. "ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని మిగతా .. 2లో..

పార్టీకి వ్యతిరేకంగా

## ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవ్




టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మంత్రి కొండా సురేఖను గతంలో కాపాడాను.. ఇప్పుడు ఆ అవకాశం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మిగతా .. 2లో..

ఏఈ నూకరాజు భార్య

## మీనా మృతదేహం లభ్యం

ముగిసిన గాలింపు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనలో విషాదాంతం చోటుచేసుకుంది. గోదావరి నదిలో గల్లంతైన ఆయన భార్య మీనా (55) మృతదేహం శనివారం లభ్యమైంది. ఆరు రోజులుగా కొనసాగుతున్న గాలింపు చర్యలకు దీంతో ముగింపు పలికినట్లయింది. వివరాల్లోకి వెళితే, కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ శిక్షకుడు సాధిక్ ఖాన్ వేధింపులు తాళలేక ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి ఏఈ నూకరాజు మిగతా .. 2లో..

## నోరు తెరిస్తే అబద్ధాలు.. అడుగు వేస్తే అరాచకం

అసెంబ్లీకి రాకుండా జగన్ పారిపోతున్నారని ఎద్దేవా : మంత్రి పార్థసారథి ఫైర్



**మంగళగిరి, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతకు ఉద్యోగాలివ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ వైసీపీ అధ్యక్షుడు జగన్ నోరు తెరిస్తే అబద్ధాలు, అడుగు వేస్తే అరాచకం తప్ప మరొకటి ఉండదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీని భ్రష్టుపట్టించిన ఘోరాలను కప్పిపుచ్చుకోవడానికే, నేడు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న మెగా డీఎస్సీపై జగన్, ఆయన పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 కుంభకోణంపై హైకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన నివేదికపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా అని మంత్రి సవాల్ విసిరారు. "నాడు గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించినట్లే, నేడు ఏపీపీఎస్సీ స్కామ్‌ను కప్పిపుచ్చుకోవడానికి మిగతా .. 2లో..

లండన్ యూనివర్సిటీని

## సందర్శించిన సీఎం రేవంత్



**లండన్, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణకు ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం లండన్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణలో ఉన్న అవకాశాలపై ఆ వర్సిటీ ప్రతినిధులతో సీఎం బృందం చర్చించింది. హైదరాబాద్‌లో క్యాంపస్ మిగతా .. 2లో..

## 'కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుంది'

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు



**ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుపట్టారు. పెట్టుబడులను ఆకర్షించడమే ఇటువంటి పర్యటనల ముఖ్య ఉద్దేశమని, వాటికి అనుమతి నిరాకరించడం అన్యాయమేనని మండిపడ్డారు. కేంద్రం కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుందని ఆరోపించారు. "వారు తమకు నచ్చిన వారికి అనుమతి ఇస్తారు. కానీ, తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం ఇవ్వలేదు. అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన మిగతా .. 2లో..

ఆరోగ్యం బాలేకపోతే..

## చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు

రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్




**ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** అనారోగ్యానికి గురైతే వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇంటర్నెట్, చాట్‌జీపీటీలో లక్షణాలను వెతికి.. తమకు ఫలానా వ్యాధి ఉందని ఊహించుకోవద్దని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. అలా చూసుకునేవారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతోందని తెలిపారు. శనివారం నోయిడాలో ఆయన మాట్లాడుతూ.. "ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మంచి పరిణామమే. కానీ ఇంటర్నెట్‌లో కనిపించిన సమాచారంతో ఒక నిర్ణయానికి రావడం సరైంది కాదు. స్వల్పంగా ఛాతినొప్పి వచ్చినా.. ఆన్‌లైన్‌లో మిగతా .. 2లో..

## 75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు

ట్రంప్‌నకు కోర్టు షాక్



**ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. "75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని మిగతా .. 2లో..




# కాకినాడ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినుల ఘర్షణ

• మొబైల్ చోరీ వివాదంతో మొదలైన తోపులాట • పలువురికి గాయాలు • ఇద్దరికి జీజీహెచ్‌లో చికిత్స • పోలీసుల రంగప్రవేశం





**కాకినాడ (క్రైమ్ విశ్వం వాయిస్ విభాగం):** నగర పరిధిలోని ఎస్కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థినుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. మొబైల్ ఫోన్ చోరీకి గురైందన్న చిన్న వివాదం చినికి చినికి గాలివానలా మారి, ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసుకునే స్థాయికి చేరింది. ఈ ఘటనలో పలువురు మిగతా .. 2లో..

సీఎం చంద్రబాబు జోక్యంతో

## సుఖాంతం

**ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలోని ఎస్కే నర్సింగ్ కాలేజీలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులకు ఎదురైన వివాదం ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో సామరస్యంగా పరిష్కారమైంది. ఈ ఘటనపై సమీక్ష నిర్వహించిన సీఎం, తక్షణమే ఉన్నతాధికారులకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఆదర్శ గ్రామాలే లక్ష్యం

గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

**వంటింటి వ్యర్థాలే సేంద్రియ ఎరువులు**

నెట్‌జీరో కార్యక్రమాలను అమలు చేస్తున్న జె.మహేశ్వరరావు నివాసాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. మహేశ్వరరావు, ఆయన సతీమణి ఇంట్లో చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్టింగ్ గుంతల్లో వేస్తూ.. అక్కడికక్కడే సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని సీఎంకు చూపించారు. ఇలా ఇంట వండే తడి వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల ఎరువుల కొనుగోలు ఖర్చు తగ్గుదలతో పాటు వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణకు అయ్యే శ్రమ కూడా తగ్గుతుందని వివరించారు. వ్యర్థాన్ని సమస్యగా కాకుండా వనరుగా మార్చే ఈ విధానం గ్రామాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారం**

ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని రోడ్లపైకి వదలకుండా నిర్దేశిత గుంతల్లోకి మళ్లించే ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని కూడా సీఎం పరిశీలించారు. దీంతో కాలనీ రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటంతో పాటు దోమలు, ఈగల వృద్ధిని నియంత్రించవచ్చని లబ్ధిదారు వివరించారు. ఈ విధానం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు కుటుంబాలకు, చుట్టుపక్కల ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేలా ఇంట్లో ఏర్పాటు చేసిన ఇండక్షన్ స్టవ్ పనితీరును కూడా లబ్ధిదారు ముఖ్యమంత్రికి వివరించారు. దీపం పథకం కింద ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నప్పటికీ.. ఇండక్షన్ స్టవ్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించడం ద్వారా గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఇండక్షన్‌తో వంట వేగంగా, పరిశుభ్రంగా ఉండటంతో పాటు గ్యాస్ సిలిండర్ల వినియోగం తగ్గుతుందని వివరించారు. అనంతరం ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌ను సీఎం పరిశీలించారు. సౌర విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్‌ను వినియోగించడం ద్వారా అదనపు విద్యుత్ వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం లబ్ధిదారు కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సెల్ఫీ దిగారు.

# కేరళ చేరుకున్న పవన్ కల్యాణ్

తీసుకోనున్నట్లు సమాచారం. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, చికిత్స పూర్తయ్యే వరకు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండనున్నారని తెలుస్తోంది. పవన్ కల్యాణ్ వెంట పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా కేరళ వెళ్లినట్లు సమాచారం.

# టైమ్, డేట్ నీ ఇష్టం!

జగన్, ఇప్పుడు మేం పారదర్శకంగా భర్తీ చేసిన 16 వేల ఉద్యోగాలపై దుష్ప్రచారం చేస్తున్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అంటే కూడా ఆయనకు అవగాహన లేదు. అసెంబ్లీలో వారి ఆరోపణలకు సమాధానం చెప్పినా, బయటకు వచ్చి మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కష్టపడి టెట్, డీఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించడం మానుకోవాలి" అని లోకేశ్ హితవు పలికారు. జగన్ చెప్పే అబద్ధాలను కార్యకర్తలు బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలే పార్టీకి బలం**

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి త్యాగాల పునాదులపైనే పార్టీ నిలబడి ఉందని స్పష్టం చేశారు. "కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించే బాధ్యత నాది. కార్యకర్తలు నన్ను వెతుక్కుంటూ రావాల్సిన పనిలేదు. కష్టపడే వారిని నేనే వెతుక్కుంటూ వస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను న్యాయబద్ధంగా తొలగిస్తామని, ఇప్పటికే 75 శాతం కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు బిల్లుల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని లోకేశ్ అన్నారు. "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకువచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. అయితే, వైసీపీ ఎంపీ గురుమూర్తి కాగ్నిజెంట్ సంస్థకు భూ కేటాయింపును అడ్డుకోవాలని కోర్టును ఆశ్రయించడం వారి అభివృద్ధి నిరోధక వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

**అదితి గజపతిరాజుపై ప్రశంసలు**

విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తారని లోకేశ్ ప్రశంసించారు. "అసెంబ్లీలో అదితి గారు రోజుకు మూడుసార్లైనా నా వద్దకు వచ్చి నియోజకవర్గ సమస్యల గురించే మాట్లాడతారు. జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యూసిటీ కోసం గజపతి రాజుల కుటుంబం 150 ఎకరాలు ఉచితంగా ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనం" అని కొనియాడారు. సీనియర్ నేత అశోక్ గజపతిరాజు గురించి మాట్లాడుతూ, "ఆయన నానో కారులో తిరిగినా, ఆయన రాజసం రోల్స్ రాయిస్ లాంటిది. గత ప్రభుత్వం ఆయనను ఎన్నో ఇబ్బందులు పెట్టింది. ఎన్ని కేసులు పెట్టినా మా నాయకులకు బలమే కానీ బలహీనత కాదు" అని వ్యాఖ్యానించారు.

**రప్ప రప్ప బ్యాచ్‌కు నో ఎంట్రీ.. స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి**

వైసీపీ నుంచి టీడీపీలోకి రావాలనుకునే వారికి పార్టీలో స్థానం లేదని లోకేశ్ తేల్చిచెప్పారు. "రప్ప రప్ప అంటే చూస్తూ ఊరుకోం. చట్టాన్ని ఉల్లంఘిస్తే బొక్కలో వేసే బాధ్యత నాది. రెడ్ బుక్ దాని పని అది చేసుకుపోతుంది. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి ఇక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేశాం" అని హెచ్చరించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పంచాయతీ నుంచి ఢిల్లీ వరకు కూటమి ప్రభుత్వాలు ఉంటేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి అద్భుత విజయాలు సాధించాలని కోరారు. అనంతరం, సమావేశానికి హాజరైన ప్రతి కార్యకర్తతో ఆయన ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవ్

అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవన్నారు. కొండా సుస్మిత.. గీత దాటి నేరుగా సీఎంపైనే ఆరోపణలు చేశారన్నారు. అనిరుధ్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి అంతగా హద్దులు దాటి మాట్లాడలేదని, వారిద్దరూ సీఎం గౌరవానికి భంగం కలిగించలేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# మీనా మృతదేహం లభ్యం

తన కుటుంబంతో కలిసి రాజమహేంద్రవరంలోని రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలోకి దూకారు. ఈ ఘటనలో మనవడు కార్తికేయ ఈదుకుంటూ ఒడ్డుకు చేరి ప్రాణాలతో బయటపడ్డాడు. నదిలో గల్లంతైన మిగతా ముగ్గురి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఈ నెల 17న నూకరాజు, 20న ఆయన కుమార్తె సౌజన్య మృతదేహాలను అధికారులు వెలికితీశారు. తాజాగా శనివారం ఉదయం ధవళేశ్వరం బ్యారేజ్‌కు సుమారు 30 కిలోమీటర్ల దిగువన, ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద మీనా మృతదేహాన్ని గాలింపు బృందాలు గుర్తించాయి. మీనా మృతదేహం కూడా లభ్యం కావడంతో నదిలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలను వెలికితీసినట్లయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఇలా జలసమాధి కావడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నోరు తెరిస్తే అబద్ధాలు.. అడుగు వేస్తే అరాచకం

మెగా డీఎస్సీపై బురదజల్లడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీపై వైసీపీ నేతలు 300 కేసులు వేయగా, వాటి వెనుక కుట్ర ఉందని న్యాయస్థానమే అభిప్రాయపడింది" అని పార్థసారథి గుర్తుచేశారు. వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రూప్-1 పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో కాకుండా, ప్రైవేట్ రిసార్టుకు తరలించి తమకు అనుకూలమైన వారితో మూల్యాంకనం చేయించారని మంత్రి ఆరోపించారు. "ప్లంబర్లు, కార్పెంటర్లు, రోజువారీ కూలీలు, పరీక్ష రాసిన వారి కుటుంబ సభ్యులతోనే పేపర్లు దిద్దించినట్లు సిట్ నివేదికలోనే బట్టబయలైంది. జవాబు పత్రాల్లో విచ్చలవిడిగా వైట్నర్ వాడటం, డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లు సృష్టించడం ద్వారా అర్హులైన పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎఫ్‌ఎస్‌ఎల్ ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 95 శాతం మంది పేపర్లలో తీవ్ర అవకతవకలు జరిగాయని, 89 పత్రాల్లో ఎగ్జామినర్ సంతకాలు కూడా సరిపోలలేదని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంతోనే 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని పార్థసారథి తెలిపారు. పెట్టుబడులు ఆకర్షించి ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తూ, ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఐదేళ్లలో చేసిన పాపాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే 11 మంది ఎమ్మెల్యేలున్నా జగన్ అసెంబ్లీకి రాకుండా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. నాడు ఒక్కరైనా లోక్ సత్తా జయప్రకాశ్ నారాయణ, బీజేపీ కిషన్ రెడ్డి అసెంబ్లీలో ఒంటరి పోరాటం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయకత్వంలో యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

# సందర్శించిన సీఎం రేవంత్

ఏర్పాటుకు ఆలోచిస్తున్నట్లుగా లండన్ వర్సిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి కేంబ్రిడ్జ్ వర్సిటీకి వెళ్లారు. ఆ వర్సిటీ ప్రతినిధులతో సమావేశమై విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను వివరించారు. రాజధాని నగరాన్ని ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తమ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్‌కు చెందిన ప్రొఫెసర్లు జయదీప్ ప్రభ్, వెంకట శిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

# 'కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుంది'

ఎంతోమంది ప్రవాస భారతీయులు ఉన్నారు. ముఖ్యమంత్రులు అక్కడికి వెళ్లి.. తమ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని, పరిశ్రమలు స్థాపించాలని వారిని ఆహ్వానిస్తుంటారు. అదేవిధంగా.. పెట్టుబడులు పెట్టాలనుకునే వారు కూడా ఇటువంటి పర్యటనల సమయంలో ప్రభుత్వం నుంచి అక్కడినుంచి పెట్టుబడులు వస్తే రాష్ట్రానికి, దేశానికే ప్రయోజనం. ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయి. రేవంత్ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం తప్పు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ.. పెట్టుబడులు దేశానికే కదా వస్తాయి" అని మీడియాతో మాట్లాడుతూ ఖర్గే పేర్కొన్నారు.

# చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు

వెతికి తీవ్రమైన గుండె జబ్బు ఉందని కొందరు భయపడుతున్నారు. అదే నొప్పి.. ఆందోళన, కండరాల సమస్యల వల్ల కూడా రావచ్చు. కొందరు రోగులు వారికి ఉన్న లక్షణాలు చెప్పకుండా.. ఇంటర్నెట్‌లో చదివిన వ్యాధి పేరును వైద్యుడికి చెబుతున్నారు" అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు.. స్థానిక భాషలోని పదాలతో లక్షణాలను చెప్పడం కూడా వైద్యులకు సవాలేనని రాజ్‌నాథ్ అన్నారు. ఛాతీలో 'దుక్ దుక్' గా ఉందని ఓ గ్రామీణుడు వైద్యుడికి చెప్పిన ఉదాహరణను ఆయన వివరించారు. వైద్య విద్యలో 'దుక్ దుక్' అనే లక్షణం గురించి ఎక్కడా ఉండదని చమత్కరించారు. యంత్రాలు శరీరంలో ఏం జరుగుతుందో గుర్తించగలవు.. కానీ రోగి మనసులోని భయం, ఆందోళనను అర్థం చేసుకోవడం వైద్యులకే సాధ్యమని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు.

# 75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు

నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది" అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# సీఎం చంద్రబాబు జోక్యంతో సుఖాంతం

ఆదేశాలు జారీ చేయడంతో యంత్రాంగం వేగంగా స్పందించి సమస్యను సద్దుమణిగేలా చేసింది. వివరాల్లోకి వెళితే, కాకినాడలోని ఎస్‌కే నర్సింగ్ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థినుల పరస్పర దాడులకు సంబంధించిన ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన వెంటనే స్పందించి, సమస్యను తక్షణం పరిష్కరించాలని సీనియర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీ రంగంలోకి దిగారు. అధికారులు విద్యార్థుల భద్రతకు పూర్తి హామీ ఇచ్చారు. వారికి అవసరమైన వసతి సౌకర్యాలను కల్పించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాజమాన్యంతో చర్చించి వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించిన తీరు, కల్పించిన భరోసా పట్ల ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల సత్వర చర్యల వల్ల వివాదం మరింత ముదరకుండా సుఖాంతమైంది.

# కాకినాడ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినుల ఘర్షణ

విద్యార్థినులకు గాయాలయ్యాయి.

**సంఘటన వివరాలు:**

పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు.. కళాశాలలో చదువుతున్న మణిపూర్ విద్యార్థిని మొబైల్ ఫోన్ కనిపించకుండా పోవడంతో, ఆమె సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో ఈశాన్య రాష్ట్రాలకు (మణిపూర్, నాగాలాండ్) చెందిన విద్యార్థినులకు, స్థానిక విద్యార్థినులకు మధ్య తీవ్ర వాగ్వాదం చెలరేగింది. మాటమాట పెరగడంతో ఇరువర్గాలు పరస్పరం తోపులాటకు దిగి కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో పలువురు గాయపడగా, తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థినులను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**పోలీసులు, అధికారుల జోక్యం:**

సమాచారం అందుకున్న వెంటనే సర్పవరం సీఐ, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సైలు, ఆర్డీవో, డీఎంహెచ్‌వోలతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థినులకు సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోయిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. అనంతరం ఈశాన్య రాష్ట్రాల విద్యార్థినుల భద్రత దృష్ట్యా వారిని వేరొక సురక్షిత హాస్టల్‌కు తరలించారు.

**పుకార్లు నమ్మవద్దు: కలెక్టర్, ఎస్పీ**

ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ స్పందిస్తూ.. విద్యార్థుల మధ్య వచ్చిన చిన్నపాటి వివాదం పూర్తిగా పరిష్కారమైందని, ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో సర్టిఫికెట్ల చోరీ లేదా విద్యార్థుల తొలగింపు అంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని, విద్యార్థుల భద్రతకు పూర్తి బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు. కళాశాలలో శాంతిభద్రతల పరిరక్షణపై యాజమాన్యానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

క్రీడలు ఆరోగ్యం, ఉపాధి,

# ఆర్థిక ప్రగతికి దోహదపడతాయి

- బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల గాలా డిన్నర్‌లో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు
- విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు సీఎం ప్రతిపాదన
- అపెక్స్ 2036 ద్వారా 2036 ఒలింపిక్స్‌కు క్రీడాకారులను సిద్ధం చేస్తామని వెల్లడి
- అమరావతి స్పోర్ట్స్ సిటీ, నెల్లూరు క్రీడా ఉపకరణాల హబ్ ఏర్పాటు ప్రణాళికలు
- క్రీడా రంగంలో కలిసి పనిచేద్దామని బ్రిక్స్ దేశాలకు ముఖ్యమంత్రి పిలుపు






**విశాఖపట్నం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** భాష, సంస్కృతి, భౌగోళికంగా విభిన్నమైన బ్రిక్స్ దేశాలను క్రీడలు, యువత ఏకం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న బ్రిక్స్ దేశాల యువజన, క్రీడల మంత్రుల సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేసిన గాలా డిన్నర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా, బ్రిక్స్ దేశాల మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు విశాఖ కేంద్రంగా 'బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్'ను ఏర్పాటు చేయాలని ఆయన కీలక ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక సమావేశాలకు విశాఖ నగరం వేదిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశాఖ నగరం ప్రాముఖ్యతను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "సిటీ ఆఫ్ డెస్టినీ"గా పేరుగాంచిన విశాఖపట్నం, భారత తూర్పు తీరానికి ఒక ఆభరణం వంటిదని అభివర్ణించారు. తూర్పు కనుమలు, బంగాళాఖాతం కలిసే ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలు, ఆర్థిక అభివృద్ధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ, ప్రతిభా రంగాల్లో వరుసగా రెండో ఏడాది దేశంలోనే 'నంబర్‌వన్ సిటీ ఆన్ ద రైజ్'గా విశాఖ గుర్తింపు పొందిందని, మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా నిలిచిందని గుర్తుచేశారు. వ్యూహాత్మక మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ-ఇన్నోవేషన్ హబ్‌గా ఎదుగుతున్న విశాఖ, నూతన భారతదేశ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.

**క్రీడలతో ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి**

సాంకేతికత ఆధారిత జీవనశైలి వల్ల యువతలో ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, దీనిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం ఎంతగానో దోహదపడతాయని సూచించారు. క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాదని, అవి సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానానికి నిదర్శనమని అన్నారు. ఆరోగ్యవంతమైన పౌరులతోనే బలమైన సమాజం, ఉత్పాదక శక్తి కలిగిన దేశం నిర్మితమవుతుందని పేర్కొన్నారు. క్రీడలు అథ్లెట్లు, కోచ్‌లు, ఈవెంట్ మేనేజర్లకు ఉపాధి కల్పించడమే కాకుండా, స్పోర్ట్స్ టూరిజం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని వివరించారు.

**ఏపీలో క్రీడారంగ అభివృద్ధికి బృహత్ ప్రణాళికలు**

రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలను చంద్రబాబు వివరించారు. 'అపెక్స్ 2036' కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులను గుర్తించి, 2036 ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ పోటీలకు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇందులో భాగంగా 28 జిల్లాల్లో 56 రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేసి, వాటిని రాష్ట్రస్థాయి అకాడమీలతో అనుసంధానిస్తామని చెప్పారు. అమరావతిలో 'స్పోర్ట్స్ సిటీ'ని, నెల్లూరులో క్రీడా ఉపకరణాల తయారీ హబ్‌ను, విశాఖను అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ బృహత్ ప్రణాళికలో భాగస్వాములు కావాలని, క్రీడా ఉపకరణాల తయారీ, శిక్షణ, స్పోర్ట్స్ టూరిజం వంటి రంగాల్లో కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలను ఆయన ఆహ్వానించారు. భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

డీఎస్సీలో అవకతవకలు

# జరగలేదు.. జరగనివ్వను : సీఎం చంద్రబాబు

**అనకాపల్లి, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని సీఎం చంద్రబాబు మరోసారి తేల్చి చెప్పారు. అన్ని ఉద్యోగాల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే క్రీడా కోటా అమలు చేశామన్నారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచే కుట్రకు వైకాపా తెరలేపిందని మండిపడ్డారు. వైకాపా హయాంలో గ్రూప్ 1 నియామకాల్లో అవకతవకలకు పాల్పడి.. ఏపీపీఎస్సీని అస్తవ్యస్తం చేశారన్నారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. "మెగా డీఎస్సీ ద్వారా మేం ఉద్యోగాలిస్తే.. 350 పిటిషన్లు వేశారు. ఎక్కడ నాకు పేరు వస్తుందోనన్న అసూయతో కుట్రలు చేశారు. దుష్ప్రచారాలు చేసి అడ్డుకోవాలని ప్రయత్నించారు. డీఎస్సీలో అవకతవకలు జరగలేదు. జరగనివ్వను. మెరిట్‌పైనే పోస్టులు ఇచ్చిన సంప్రదాయం మాది. మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరం. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాలి. ఐదేళ్ల పాటు గొడ్డలి పార్టీ అరాచకాలను అందరూ చూశారు. విధ్వంసం, నేరాలు-ఘోరాలు నమ్ముకొని పనిచేసింది. నకిలీ మద్యం వల్ల 30వేల మంది చనిపోయిన పరిస్థితి. లక్షలాది మంది అనారోగ్యం బారినపడ్డారు. కలుషిత మద్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు" అని సీఎం మండిపడ్డారు.

# ఎడిటర్ వాయిస్

## మూడో వంతు త్యాగాలేనా? కూటమిలోని కొత్త నిష్పత్తి?

స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయి. దాంతో తమకు పదవులు దక్కుతాయి అని కార్యకర్తలు నాయకులు గ్రౌండ్ లెవెల్ లో సంబర పడుతున్నారు. అదే సమయంలో ఎక్కడ ఎవరికి సీట్లు వస్తాయో అన్న బెంగ కూడా కూటమి పార్టీ కార్యకర్తలలో ఉంది. తాము ముందుగా ప్రచారం చేసుకున్నా చివరి నిముషంలో తప్పుకోవాల్సి వస్తుందేమో అన్న భయాలు కూడా ఉన్నాయి అంటున్నారు. దానికి కారణం పొత్తులు కొలిక్కి రావాల్సి ఉండడమే. ఎవరికి ఎక్కడ ఏ మోతాదుతో ఏ నిష్పత్తిలో సీట్లు ఇస్తారో తేలిపోతే మొదటి విజయం సాధించినట్లే అన్నది కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తల మాట.

**జనసేన ఒత్తిడితో :** ఇక జనసేన అయితే తగ్గేది లేదు అని అంటోంది. ఈసారి లెక్క వేరు అని కూడా బిగ్ సౌండ్ చేస్తోంది. 2024 ఫార్ములాని మరచి పోవాల్సిందే అని కూడా అంటోంది. 2026 లో స్థానిక పోరులో లెక్కలు మారిపోతాయని కూడా బల్ల గుద్దుతోంది. దాంతోనే ఏ పార్టీకి ఎన్ని సీట్లు ఇస్తారో అన్నది మాత్రం తేలడం లేదు, నిజానికి సీట్ల సర్దుబాటు గురించి ప్రాధమికంగా సమావేశం కూడా కూటమి పార్టీల అధినేతల మధ్య జరగలేదు. కానీ ఈ మధ్యన ఒక నిష్పత్తి అయితే బయటకు వచ్చింది టీడీపీకి 80 శాతం జనసేనకు 15 శాతం బీజేపీకి అయిదు శాతం సీట్ల నిష్పత్తిలో పంపకాలు ఉంటాయన్నదే ఆ సారాంశం. దాంతో జనసేన తీవ్రంగా విభేదించింది. ఇక బీజేపీ శిబిరంలో కూడా ఎక్కువ సీట్లు కోరాలని డిమాండ్ ఉందని అంటున్నారు.

**ఈ ఫార్ములా నిజమేనా :** ఈ క్రమంలో తాజాగా ఒక కొత్త ఫార్ములా తెర మీదకు వచ్చింది. అయితే ఇది సోషల్ మీడియాలో ప్రచారంగానే ఉంది. అధికారికంగా మాత్రం కాదు. కేవలం ఊహాగానాలుగనే ఈ ఫార్ములాను తెర మీదకు తెచ్చారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఈ ఫార్ములా ప్రకారం చూస్తే టీడీపీ మొత్తం సీట్లలో 65 శాతం తీసుకుంటుందని అంటున్నారు. అలాగే జనసేన కోరినట్లుగా 30 శాతం సీట్లను ఆ పార్టీకి కేటాయిస్తుంది అని అంటున్నారు. ఇక బీజేపీకి అయిదు శాతం ఇస్తారని అంటున్నారు. ఆ విధంగా చూస్తే సీట్ల సర్దుబాటులో కొత్త ఫార్ములా పొత్తులలో జనసేన ఘన విజయం సాధించినట్లే అని అంటున్నారు. బీజేపీ మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు కదిలే పరిస్థితి కనిపించడం లేదు అని అంటున్నారు.

**తమ్ముళ్ళు తగ్గాల్సిందేనా :** అయితే ఈ ఫార్ములా సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా సాధ్యమయ్యే పనేనా అన్నది కూడా చర్చగా ఉంది. ఎందుకంటే తమ్ముళ్ళు ఏకంగా తమకు దక్కే సీట్లలో 35 శాతాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. అంటే మూడవ వంతు అన్న మాట. ప్రతీ మూడు సీట్లలో ఒకటి టీడీపీకి దక్కదు అంటే అతి పెద్ద పార్టీ బూత్ లెవెల్ దాకా విస్తరించి ఉన్న పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న టీడీపీలో తమ్ముళ్ళు ఊరుకుంటారా అన్నదే ప్రశ్నగా ఉండబోతోంది. అంతే కాదు వారు త్యాగానికి సిద్ధపడతారా అన్నది కూడా కీలకమైన ప్రశ్న. టీడీపీకి అందరి కంటే బలమైన నేతలు ఉన్నారు. ఆ పార్టీకి అన్ని సామాజిక వర్గాలలో పట్టున్న నేతలు ఉన్నారు. 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు అంటే టీడీపీకి ఎక్కువ మంది అభ్యర్థులు కూడా ఈజీగా దొరుకుతారు అని అంటున్నారు. గడచిన రెండేళ్లుగా స్థానిక సంస్థల ఎన్నికల మీద కోటి ఆశలు పెట్టుకున్న టీడీపీ తమ్ముళ్ళు మూడవ వంతు సీట్ల కోతకు అంగీకరిస్తారా అన్నదే చూడాలి. ఏది ఏమైనా సీట్ల సర్దుబాటు అన్నది పీటముడిగా కూటమికి పడబోతోంది అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరు మృతి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. శిథిలాల కింద నుంచి వారి మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా గుర్తించారు. నిర్మాణం పూర్తయి అద్దెలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం ఈ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా కూలిపోయింది. శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌పై పడటంతో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆ అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్‌మెంట్ గోడలు ధ్వంసం కావడంతో అందులో ఉన్నవారు బయటకు వెళ్తున్నారు. అలాగే, పక్కనే ఉన్న ఓ హాస్టల్ విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, ఫైర్, ఎస్‌డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది.. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే మాత్రం ప్రాణ నష్టం అధికంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలిని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**బిల్డర్ కోసం గాలింపు!**

జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా భవనం నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడంతో నిర్మించడంతో పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ భవనం నిర్మాణం చేస్తున్న బిల్డర్ సాజిద్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

## ఫోను ఈఎంఐ గొడవ.. కుటుంబం బలి



**మహారాష్ట్ర, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో శుక్రవారం తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఐ ఫోను ఈఎంఐ చెల్లింపు కోసం తల్లిదండ్రులతో గొడవపడిన కునాల్ (19) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడేందుకు స్థానిక ఖవద్యా డోంగర్ కొండ అంచుకు వెళ్లాడు. కిందికి దిగి రావాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంతగా బతిమాలినా వినలేదు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వలలు సిద్ధం చేయగా.. పైన ఉన్న కునాల్ పదే పదే స్థానాలు మారుస్తూ వచ్చాడు. దీంతో కుమారుడిని రక్షించేందుకు తండ్రి మురళీధర్ (48) కూడా కొండపైకి వెళ్లి తీవ్ర ప్రయత్నం చేశారు. దాదాపు మూడు గంటలపాటు ఈ వ్యవహారం నడిచింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఇద్దరూ కొండపై నుంచి జారిపడి మృతిచెందారు. కళ్ల ముందే భర్త, కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో తీవ్రంగా కలత చెందిన యువకుడి తల్లి సంగీత అదే కొండపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. అందరూ చూస్తుండగా.. ఒకే కుటుంబంలో ముగ్గురు ఇలా మృతిచెందడం స్థానికులను కలచివేసింది.

### చాటింగ్ చేస్తోందని భార్యను చంపేసి..

## మృతదేహాన్ని నదిలో విసిరేసి..

**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** పరాయి వ్యక్తితో చాటింగ్ చేస్తోందనే అనుమానంతో భార్యను చంపేసి నదిలో పడేశాడో వ్యక్తి. ఈ ఘటన యానాంలో చోటు చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. యానాం పరిధి కనకాలపేటకు చెందిన చెక్కా అప్పారావు(29), భీంనగర్‌కు చెందిన పువ్వల రేఖ (26) ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల బాబు, రెండేళ్ల పాప ఉన్నారు. అప్పారావు చేపలు వేటాడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేరేవాళ్లతో రేఖ చాటింగ్ చేస్తోందని వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి 8.30కు ఇంటికొచ్చిన అప్పారావు కుమారుడికి తన చరవాణి ఇచ్చి స్నానానికి వెళ్లాడు. తిరిగొచ్చేసరికి ఆ ఫోన్ నుంచే భార్య చాటింగ్ చేస్తూ కనిపించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో భార్య ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. కిందపడిపోయిన భార్య ఛాతీపై కూర్చుని గొంతు నులమడంతో ఊపిరాడక ఆమె చనిపోయింది. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అప్పారావు తన సోదరుడికి చెందిన ఆటోలో మృతదేహాన్ని తీసుకెళ్లి మెట్టకూరు గణపతినగర్ వద్ద వంతెనపై నుంచి కోరింగ నదిలో విసిరేశాడు. శనివారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించట్లేదని ఫిర్యాదు చేశాడు. పొంతన లేకుండా మాట్లాడుతున్న అప్పారావును పోలీసులు తమ శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకొన్నాడు. ఎస్సై పట్టాభిరామయ్య, పోలీసులు నిందితుడిని వెంటబెట్టుకుని నదిలో గాలించారు. వంతెన నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో రేఖ మృతదేహం లభించగా యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


### రాయదుర్గంలో రోడ్డు ప్రమాదం..

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



**రాయదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి ఖాజాగూడలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు యువకులు పశ్చిమ్‌బెంగాల్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న బైక్‌పై ఖాజాగూడ నుంచి గచ్చిబౌలి అంజయ్య నగర్‌వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్టాఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ 2వ గేటు సమీపంలో కేర్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు వైపు మలుపు తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో పశ్చిమ్‌బెంగాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అబ్బాస్ సిద్ధిక్ (25) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రాష్ట్రానికి చెందిన బైక్ నడిపిన సహస్ర ఛటోపాధ్యాయ (25), వెనుక కూర్చున్న అభిజిత్ సింగ్ (25) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు. సిద్ధిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.





కాకినాడ జిల్లా


తూర్పు గోదావరి జిల్లా


డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




# బస్టాండ్‌నా.. చెత్త కుప్పనా?

### గర్ల్స్ హైస్కూల్ ఆనుకుని దుస్థితి..

### అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం




**ధవళేశ్వరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థినులు, మహిళలు, వృద్ధులు నిత్యం వినియోగించే బస్టాండ్ ఇది. కానీ చూస్తే మాత్రం బస్టాండ్‌లా కనిపించడం లేదు. చెత్తాచెదారం, ఎండిపోయిన కొమ్మల కుప్పలతో ప్రయాణికులకు కూర్చునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ధవళేశ్వరం గర్ల్స్ హైస్కూల్‌కు ఆనుకుని ఉన్న ఈ బస్టాండ్ చుట్టుపక్కలే ఐటీఐ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పంచాయతీ కార్యాలయం ఉన్నాయి. ఇంత కీలకమైన ప్రాంతంలో బస్టాండ్ నిర్వహణ ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజలు కూర్చోవాల్సిన బెంచీలపై సామాన్లు.. పక్కనే కొమ్మల కుప్పలు.. చుట్టూ అపరిశుభ్ర వాతావరణం. విద్యార్థినులు, మహిళలు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలో కనీస పరిశుభ్రత లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే బస్టాండ్ దుస్థితి కనిపిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం.

బస్టాండ్‌ను శుభ్రం చేయించడానికి కూడా అధికారులు కళ్లకు కనిపించని పరిస్థితి ఏర్పడిందా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొమ్మలు, చెత్తాచెదారం తొలగించి బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుని విరాళం

### భార్య జ్ఞాపకార్థం రూ.12 వేలు ఆర్థిక సహాయం

### కెమిస్ట్రీ ఉపాధ్యాయులు సాయన్నకు తోటి ఉపాధ్యాయుల అభినందనలు



**రాయవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీటీ కెమిస్ట్రీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వరాహగిరి సాయన్న తన భార్య వరాహగిరి లక్ష్మీ పద్మజ జ్ఞాపకార్థం పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు రూ.12,000 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విప్పర్తి శాంతి సునీతకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన సాయన్నను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. పాఠశాల అవసరాల కోసం అందించిన ఈ ఆర్థిక సహాయం విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల వేగాన్ని నియంత్రించాలి

### ప్రయాణికుల భద్రత ముఖ్యం : ఎస్సై శ్రీను నాయక్



**సీతానగరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం వద్ద ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీను నాయక్ ఇసుక లారీల ను నిలిపివేసి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఇసుక రవాణా చేసే సమ యంలో లారీ పై భాగంలో టార్పాలిన్ పట్టాలను తప్ప నిసరిగా గట్టిగా కప్పాలని స్పష్టం చేశారు. పట్టాలు కప్పకపోవడం వల్ల వాహ నం వెళ్ళేటప్పుడు రోడ్లపై ఇసుక పడి ఇతర వాహ నాల జారిపడే ప్రమాదం ఉందన్నారు. అంతే కాకుం డా లారీల వెనక వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇతర ప్రయాణికుల కళ్ళల్లో ఇసుక రేణువులు పడి తీవ్ర ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలు ప్రధాన రహదారుల గుండా వెళ్ళినప్పుడు లారీ డ్రైవర్లు అతివేగాన్ని వీడాలని సూచించారు పరిమితికి మించిన వేగంతో వెళ్లడం వల్ల హఠాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తుందని దానివల్ల వెనక వచ్చే వాహనాలు ప్రమాదాల బారిన పడతాయని తెలిపారు ప్రతి డ్రైవర్ నిబంధనలను పాటిస్తూ పరిమిత వేగంతో మాత్రమే వాహనాలు నడపాలని విజ్ఞప్తి చేశారు.రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. టార్పాలిన్ కప్పకుండా ఇసుక రవాణా చేసినా, అతి వేగంతో వాహనాలు నడిపినా, పరిమితికి మించి తీసుకెళ్లిన చలాన్లు విధించడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని తేల్చి చెప్పారు. ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ చేపడుతున్న ఈ చర్యలకు వాహనదారులు డ్రైవర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది,లారీ యజమానులు,డ్రైవర్లు పాల్గొన్నారు.

# చిరంజీవి జన్మదిన వేడుకలకు హాజరైన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** సినీ పరిశ్రమలో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకుని కోట్లాది మంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు అమలాపురం పట్టణంలోని గడియార స్తంభం వద్ద ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు అమలాపురం పార్లమెంట్ సభ్యుడు హరీష్ బాలయోగి ముఖ్య అతిథిగా హాజరై అభిమానులతో కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ హరీష్ బాలయోగి సందర్శించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన అభిమానులను అభినందించి, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని పేర్కొన్నారు. అభిమానులు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీ హరీష్ బాలయోగి కట్ చేసి అభిమానులతో కలిసి చిరంజీవి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి మరిన్ని సంవత్సరాలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తూ సినీ రంగంతో పాటు సమాజ సేవలోనూ తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మెట్ల రమణబాబుతో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. చిరంజీవి జన్మదిన వేడుకలను కేవలం అభిమానుల సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. చిరంజీవి అభిమానులు ప్రతి ఏడాది ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం, అన్నదానం, పేదలకు దుస్తుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# బాణాసంచా తయారీ కేంద్రంలో అధికారుల తనిఖీ

### బాణాసంచా కేంద్రం లైసెన్స్ గడువు ముగిసినట్లు గుర్తింపు



**రాయవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, వెదురుపాక సావరం రోడ్డులో మూసివేసి ఉన్న శ్రీ భవాని గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రాన్ని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు, రాయవరం ఎస్ఐ డి. సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన తనిఖీలో తయారీ కేంద్రం పూర్తిగా మూసివేసి ఉండగా, ఎలాంటి తయారీ కార్యకలాపాలు జరగడం లేదని గుర్తించగా, బాణాసంచా తయారీ కేంద్రం లైసెన్స్ గడువు మార్చి 31 తో ముగిసినట్లు అధికారులు గుర్తించారు. చెల్లుబాటు అయ్యే లైసెన్స్, ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా భవిష్యత్తులో బాణాసంచా తయారీ కార్యకలాపాలు చేపట్టవద్దని కేంద్రం యజమానికి సీఐ సూచించారు. అక్రమంగా బాణాసంచా నిల్వ చేయడం, తయారు చేయడం లేదా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసు, రెవెన్యూ, ఫైర్ శాఖ అధికారులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

### టిడ్కో గృహ సముదాయంలో స్వచ్ఛత కార్యక్రమం - రూ.10 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన వాసంశెట్టి సత్యం, కమిషనర్, ఏఎంసీ చైర్మన్, జనసేన ఇన్చార్జి

**రామచంద్రపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణం 1వ వార్డు కొత్తూరులోని టిడ్కో గృహ సముదాయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన పార్టీ ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాల మెరుగుదలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచి ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. టిడ్కో కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు. కాలనీల్లో నివసించే కుటుంబాలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**రూ.10 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

అనంతరం టిడ్కో కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న



సిమెంట్ రోడ్డుకు వాసంశెట్టి సత్యం, ముఖ్య అతిథులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో కాలనీవాసులకు రాకపోకల సౌలభ్యం మరింత మెరుగుపడుతుందని ఆయన అన్నారు.

**టిడ్కో కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు**

మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ, టిడ్కో కాలనీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలపై నిరంతరం చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజలు కూడా పరిశుభ్రతను అలవాటు చేసుకుని స్వచ్ఛమైన వాతావరణాన్ని కాపాడాలని కోరారు.

**స్వచ్ఛతే ఆరోగ్యానికి మొదటి మెట్టు :ఏఎంసీ చైర్మన్ అక్కల రేశ్వంత్ రాయ్**

ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలు ఉంటేనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం**
**జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్**

జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఇంటి నుంచి వీధి వరకు పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. యువత స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మూడవ విడతలో నిర్మాణంలో ఉన్న 960 టిడ్కో గృహాలను త్వరలో పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని నిర్మాణ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈఈ గంగరాజు, డీఈ సురేంద్ర, సీఎల్టీసీ బిందు, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కొత్తూరు గ్రామ పెద్దలు, కాలనీవాసులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# కామనగరువులో ఘనంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం

## పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : జాయింట్ కలెక్టర్ వై.నైడియాదేవి



**అమలాపురం, ఆగస్టు 22: విశ్వం వాయిస్ న్యూస్ :** "మా ఇల్లు-మా కుటుంబం-మన జిల్లా" అనే భావనతో ప్రతి ఒక్కరూ జాగృతమై పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. నైడియా దేవి పిలుపునిచ్చారు. శనివారం అమలాపురం మండలం కామనగరువు గ్రామపంచాయతీలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో మొక్కలు నాటి, పారిశుధ్య నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని అన్నారు. మన ఇంటిని, కుటుంబాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా మన గ్రామాన్ని, జిల్లాను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలని తెలిపారు. పరిశుభ్రత అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన గ్రామాలను నిర్మించగలమని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల పక్కన, కాలువల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని కోరారు. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే పరిశుభ్రమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రతను ఒక కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛమైన గ్రామాలు, మండలాలు, జిల్లాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యంపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ గ్రామపంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత పరస్పరం అనుసంధానమై ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులతో జాయింట్ కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ప్రతిరోజూ చేపడుతున్న చెత్త సేకరణ, తడి-పొడి చెత్త వేర్పాటు, చెత్త తరలింపు, పారిశుధ్య నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో చెత్త సేకరణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి శాంతి కుమారి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు జలాలను పవిత్రంగా భావిస్తారని, అలాంటి నీటి వనరులను కాలుష్యానికి గురికాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెరువులు, కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను వేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. భావితరాల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ప్రతి కుటుంబం పరిశుభ్రతపై బాధ్యత తీసుకుంటే గ్రామాల్లో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా, వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను కలుషితం కాకుండా చూడడం వంటి చర్యలను ప్రజలు అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డీఎల్‌డీవో విజయభాస్కర్, అమలాపురం తహసీల్దార్ దివాకర్, సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి

# 71వ జన్మదిన వేడుకలు

## అన్నసమారాధనలో పాల్గొని అభిమానులకు, ప్రజలకు స్వయంగా అన్నదానం వడ్డించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు అమలాపురంలో మెగా అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. చిరంజీవికి ప్రత్యేక అభిమానం ఉన్న ప్రాంతంగా పేరుగాంచిన అమలాపురంలో గడియార స్తంభం వద్ద అభిమానులు భారీగా వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై అభిమానులతో కలిసి చిరంజీవి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు పాల్గొని ప్రజలకు, అభిమానులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరంజీవికి అమలాపురంలో అత్యంత ప్రత్యేకమైన అభిమానం ఉందని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ మెగాస్టార్‌కు విశేషమైన అభిమాన బలం ఉందన్నారు. చిరంజీవి అభిమానులు ఆయనను కేవలం సినీ నటుడిగా మాత్రమే కాకుండా తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తారని పేర్కొన్నారు. తనకు స్వల్పంగా జ్వరం ఉన్నప్పటికీ ఈ వేడుకల్లో పాల్గొనడానికి ముఖ్య కారణం చిరంజీవిపై తనకున్న అభిమానంతో పాటు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నయ్యగా చిరంజీవికి ఉన్న ప్రత్యేక స్థానం, కూటమికి మెగా అభిమానులు అందించిన అండదండలేనని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి విజయానికి మెగా అభిమానులు ఎంతో సహకరించారని, వారి అభిమానం, మద్దతు ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. చిరంజీవి వెండితెరపై తన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకోవడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే ఆనందరావు కొనియాడారు. ముఖ్యంగా బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి సేవా కార్యక్రమాల ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడటంతో పాటు, అనేక కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. సమాజానికి తన వంతు బాధ్యతగా సేవ చేయాలనే స్ఫూర్తిని చిరంజీవి పలువురిలో కలిగించారని అన్నారు. చిరంజీవి భవిష్యత్తులోనూ మరెన్నో సంవత్సరాలు సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంగా జీవిస్తూ ప్రజలకు, అభిమానులకు స్ఫూర్తిగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. అమలాపురం గడియార స్తంభం వద్ద జరిగిన ఈ వేడుకలకు మెగా అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అభిమానులు చిరంజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడియార స్తంభం పరిసర ప్రాంతం మెగా అభిమానుల సందడితో ఉత్సాహభరితంగా మారింది.

గురుకులాల మూసివేతతో

# రెండు వేల మంది విద్యార్థులకు ఇబ్బందులు



**అమలాపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని మేఘాద్రిగడ్డ, తాడికొండ, కోట గురుకుల పాఠశాలలను అర్ధాంతరంగా మూసివేసి వాటి స్థానంలో ఎక్సలెన్సీ సెంటర్లను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని అంబేద్కర్ మిషన్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం వల్ల సుమారు 2 వేల మంది విద్యార్థుల విద్యకు అంతరాయం కలుగుతోందని సంస్థ అధినేత పి.వి. సునీల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురంలోని అంబేద్కర్ మిషన్ ఇండియా జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట గురుకుల పాఠశాల మూసివేతతో 600 మందికి పైగా విద్యార్థులను ఇతర పాఠశాలలకు తరలించారని తెలిపారు. దీంతో వాకాడు తదితర గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి తరగతి గదులు, వసతి గృహాలు, మరుగుదొడ్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఒక్కో తరగతి గదిలో సుమారు 100 మంది, ఒక్కో మరుగుదొడ్డిని 60 మంది వరకు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యార్థులు పడుకునేందుకు కూడా తగినంత స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోట గురుకుల పాఠశాల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను అభినందించారు. ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయడంతో పాటు, సమస్యను పరిశీలిస్తానని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. తాడికొండలో సుమారు 600 మంది, మేఘాద్రిగడ్డలో సుమారు 700 మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తాడికొండ ఎమ్మెల్యే డా. తెనాలి శ్రావణ్‌కుమార్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ ఈ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎక్సలెన్సీ సెంటర్ల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని సునీల్ కుమార్ స్పష్టం చేశారు. అయితే వాటి కోసం ఇప్పటికే కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు, హాస్టళ్లను మూసివేయడం సరికాదన్నారు. అవసరమైతే అద్దె భవనాలు లేదా ఇతర ప్రభుత్వ భవనాల్లో ఎక్సలెన్సీ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనలు చేపడుతున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మూసివేసిన పాఠశాలలకు పోలీసులు వెళ్లి గేట్లకు తాళాలు వేయించడం, నిరసనలను అడ్డుకోవడం సరైన చర్య కాదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి నేరానికి పాల్పడకుండా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన చేస్తున్నారని, అలాంటి సందర్భాల్లో పోలీసుల జోక్యం ఎందుకని ప్రశ్నించారు. గురుకుల పాఠశాలల మూసివేతతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమవుతున్నప్పటికీ సమస్యకు తగినంత ప్రచారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల ఎదుట ఆందోళనలు చేస్తున్న అంశాన్ని వార్తాపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తాడికొండ, మేఘాద్రిగడ్డ, కోట గురుకుల పాఠశాలలను యథాతథంగా కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. సంబంధిత ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఆయా ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాల్సి వస్తుందని అంబేద్కర్ మిషన్ ఇండియా తరఫున హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గురుకుల పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలించాలని పి.వి. సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.

విద్యార్థుల్లో పునాది అభ్యసనాన్ని

# బలోపేతం చేయాలి : ఏఎంఓ రాంబాబు



**రామచంద్రపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) వి.రాంబాబు శనివారం రామచంద్రపురంలో పర్యటించారు. స్థానిక ఎస్ఐజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ కాంప్లెక్స్‌లు జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా నిలవాలని సూచించారు. అనంతరం రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న ఆరు రోజుల 'జ్ఞాన జ్యోతి' శిక్షణ శిబిరాన్ని ఏఎంఓ పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రాథమిక స్థాయిలోనే పునాది అభ్యసనాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని, ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో వి. వరాహలక్ష్మి, ఎంఈవో-2 వాసంశెట్టి నాగేశ్వరి, పలువురు రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.


# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మెట్ల రమణబాబు




**అమలాపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని కల్వకొలను వీధి స్వర్ణ వార్డులో "క్లీన్ సిటీస్-గ్రీన్ కమ్యూనిటీస్" (పరిశుభ్రమైన నగరాలు-పచ్చని సమాజాలు) అనే ఇతివృత్తంతో పట్టణ ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడం, ప్రజల్లో బాధ్యతాయుతమైన పౌరస్పృహ కల్పించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్, డీఆర్వో కె. సుబ్బారావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిక్కాల గణేష్, పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన : అభివృద్ధికి నిధుల కొరత లేకుండా కృషి చేస్తున్న మంత్రి సుభాష్

**రామచంద్రపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. పట్టణంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రామచంద్రపురం పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ ఆడిటోరియంలో రూ.10 లక్షల జనరల్ ఫండ్స్‌తో నిర్మించనున్న జీఐ షెడ్ నిర్మాణ పనులకు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివతో పాటు కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని 1వ వార్డు కొత్తూరులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు కూడా వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని



తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మంత్రి వాసంశెట్టి సుభాష్ లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అత్యవసరమైన అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చేందుకు మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండేళ్లలో రామచంద్రపురం పట్టణంలోనే సుమారు రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వాసంశెట్టి సత్యం తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని నిధులు తీసుకువచ్చి రామచంద్రపురం నియోజకవర్గాన్ని సుందరంగా, పరిశుభ్రంగా, ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు మంత్రి సుభాష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ.. అభివృద్ధే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వాసంశెట్టి సత్యం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ఏఈ సునీల్, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# యనమల గార్డెన్‌లో ముగిసిన మహా వరుణ యాగం

**4వ రోజు కొనసాగిన ఆధ్యాత్మిక ఘట్టం - 9 మంది దంపతులతో మహాశివునికి జలాభిషేకం**
**పల్లకిలో ఋష్యశృంగ మహర్షి విగ్రహం ఊరేగింపు కోనేరులో నిమజ్జనం**






**కోటనందూరు, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్త జనసమూహం..భక్త జనులతో యనమల గార్డెన్స్ జనసందోహంతో కిక్కిరిసింది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య వరుణ కటాక్షం కోసం తలపెట్టిన మహా వరుణ యాగం ఆద్యాత్మిక ఘట్టం పూర్ణాహుతితో పరిపూర్ణమైంది. 4 రోజులుగా యనమల గార్డెన్స్ లో ఋత్వికుల వేదమంత్రాలతో నిర్వహించిన వరుణ యాగం ఋష్యశృంగ మహర్షి విగ్రహ నిమజ్జనంతో పరిపూర్ణంగా ముగిసింది. ఇవాళ యనమల రామకృష్ణుడు విజయలక్ష్మీ దంపతుల పర్యవేక్షణలో వరుణయాగం చేసిన తొమ్మిది మంది దంపతులతో మహాశివునికి జలాభిషేకం నిర్వహించారు. ఈతంతు పూర్తయిన తర్వాత ఋత్వికులు ఓవైపు వేదమంత్రోచ్చారణలతో హోమం, మరో వైపు వేదపండితులు తొమ్మిది మంది దంపతులతో యాగం వంటి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా పూర్ణాహుతి జరిపి వరుణయాగానికి ముగింపు పలికారు. ప్రభుత్వవిఫ్ యనమల దివ్య గోపీనాథ్ దంపతులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వరుణ కటాక్షం పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఋష్యశృంగ మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించి ఊరేగింపుగా రాజులకొత్తూరులోని కోనేరు వద్దకు వెళ్ళి నిమజ్జన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## గ్రామపంచాయతీల పోలింగ్ స్టేషన్ల
# జాబితా విడుదల చేసిన ఎంపీడీవో



**కోటనందూరు, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో 17 గ్రామపంచాయతీ పరిధిలో 174 పోలింగ్ స్టేషన్ల వివరములతో కూడిన జాబితా నేడు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రచురించబడుతుందని ఎంపీడీవో పి.వెంకటనారాయణ పేర్కొన్నారు. 2026 ఎన్నికల నిమిత్తం పోలింగ్ స్టేషన్లో వివరములు కూడా పంచాయతీ కార్యాలయంలో ఉంచుతామన్నారు. అదేవిధంగా మండలానికి సంబంధించి 14 మండల ప్రాదేశిక నియోజకవర్గంల తుది జాబితా మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డు నందు ఉంచడం జరిగిందన్నారు. దీనిపై ఏమైనా అభ్యంతరములు ఉంటే 26వ తేదీలోపు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

# ఏఎన్ఎం యూనియన్ జిల్లా కన్వీనర్‌గా ఉషాకుమారి



**కాజులూరు, ఆగస్టు 22 విశ్వం వాయిస్ న్యూస్ :** రిపబ్లికన్ ట్రేడ్ యూనియన్ అనుబంధమైన ఏఎన్ఎంల సంఘం జిల్లా కన్వీనర్ గా సాదే ఉషా కుమారిని ఎంపిక చేసినట్లు ఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పులి ప్రసాద్ ప్రకటించారు. కాజులూరు మండలం గొల్లపాలెం ఆర్బికే సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ఎఎన్ఎంలు ప్రజలకు అనేక సేవలు చేస్తున్నారని వాటితో పాటుగా కొంతమంది రాజకీయ నాయకుల నుండి వివిధ యూనియన్ వాళ్ళ నుండి ఎన్నో ఒత్తులు ఎదుర్కొంటున్నారని అటువంటి వాటిని ఎదుర్కోవడానికి రిపబ్లికన్ ట్రేడ్ యూనియన్ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఏఎన్ఎమ్ ల హక్కుల సాధన కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని పులి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గొల్లపాలెం పిహెచ్ సిఎఎన్ఎంల యూనియన్ కన్వీనర్ గా చింతాకుల ప్రసన్నకుమారి నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు కె.కనకదుర్గ, రామకృష్ణ, కృష్ణవేణి ఏ.బుల్లెమ్మ, పి.నాగదేవి, వి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యసాధనలో
# అందరూ భాగస్వాములు కావాలి

**తుని ఎమ్మెల్యే యనమల దివ్య**





**కోటనందూరు, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర,స్వచ్చాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య పిలుపు నిచ్చారు. తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన టి.వెంకటాపురంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర, స్వచ్చాంధ్ర కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ముఖ్య అతిధిగా విచ్చేసారు. గ్రామంలో సోలార్ ప్యానెల్స్‌ను పరిశీలించిన ఆమె నియోజకవర్గంలో అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ నేత యనమల రాజేష్ ఎంపీడీవో రవి వర్మ,మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, స్థానిక నేతలతో కలిసి ఆమె స్వచ్ఛ రధాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పంచాయితీ స్వచ్ఛ పంచాయితీలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు కలగా శ్రీను, బంధం బుజ్జి, ఖాతా గోవిందు, పప్పు నవీన్, కాసపు తాతారావు, గింజాల రాజులు, ఈసరపు గణపతి , దార్ల సత్యనారాయణ, పప్పు వీరబాబు, గజ్జి రాంబాబు, బంధం రాజయ్య, చామంతి సత్తిబాబు కొల్లు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో
# ఘనంగా అచీవర్స్ డే, గ్రాడ్యుయేషన్ డే



**అమలాపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** బోనం వెంకట చలమయ్య ఇంజినీరింగ్ కళాశాల, ఓడలరేవులో 2022-26 బ్యాచ్ విద్యార్థుల కోసం అచీవర్స్ డే, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 670 మంది బీటెక్ విద్యార్థులకు, 26 మంది ఎంటెక్ విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన 530 మంది విద్యార్థులను సత్కరించారు. అచీవర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విర్టూసా సంస్థ క్యాంపస్ లీడ్ ఇండియా డి. అభిషేక్ మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడం ద్వారా బోనం వెంకట చలమయ్య ఇంజినీరింగ్ కళాశాల దేశానికి గొప్ప సేవ చేస్తోందని అన్నారు. ఐఐసీ అధికారి డాక్టర్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక అంశాలపై వివిధ శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, కార్యశాలలు, హ్యాకథాన్‌లు నిర్వహించడంతో పాటు బహుళజాతి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా 531 మంది బీటెక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. అత్యధికంగా ఏడాదికి రూ.10 లక్షల వేతన ప్యాకేజీ సాధించినట్లు వెల్లడించారు. బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య డిగ్రీలు, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి, జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చైర్‌పర్సన్ డాక్టర్ బోనం కనక దుర్గ మాట్లాడుతూ అచీవర్స్‌ను అభినందించారు. ఉద్యోగం పొందడం మాత్రమే విజయం కాదని, తమ ప్రతిభను సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎన్.ఎస్.ఆర్. రత్నాకర రావు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ, ప్రస్తుత కాల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకునే వారికే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఫ్యాకల్టీ అఫైర్స్, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ జి. రవికిరణ్ శాస్త్రి హాజరయ్యారు. డిగ్రీలు పొందిన విద్యార్థులను అభినందిస్తూ, సమాజ అభ్యున్నతికి తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.ఎస్.ఎన్. లక్ష్మీపతి రాజు మాట్లాడుతూ 2022-26 బ్యాచ్‌కు చెందిన 670 మంది బీటెక్, 26 మంది ఎంటెక్ విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తున్నామని తెలిపారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. ప్రవీణ్ మాట్లాడుతూ దివంగత బోనం వెంకట చలమయ్య నిబద్ధత, ఆదర్శాలతో 1997లో తూర్పు గోదావరి జిల్లాలో తొలి ఇంజినీరింగ్ కళాశాలగా బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల స్థాపించబడిందని తెలిపారు. స్థానిక, దూర ప్రాంతాల విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏ.వై.ఆర్.వి. ప్రసాద్, పరిపాలనా అధికారి, యాజమాన్య సభ్యులు బోనం కృష్ణ, రాజమహేంద్రవరం బీవీసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి. జనార్దనరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. డిగ్రీలు, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. కృతజ్ఞతా ప్రసంగంతో పాటు జాతీయ గీతంతో కార్యక్రమాలు ముగిశాయి.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 'స్వచ్ఛంద స్వర్ణాంధ్ర' అవగాహన ర్యాలీ



**రామచంద్రపురం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛంద స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ రోజు భారీ అవగాహన ర్యాలీని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత స్థాయిలో చైతన్యం తీసుకురావాలన్న సంకల్పంతో కళాశాల యాజమాన్యం మరియు విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఈ ర్యాలీని ఉద్దేశించి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిశుభ్రమైన సమాజంతోనే ఆరోగ్యకరమైన రాష్ట్ర నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. స్వచ్ఛంద స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా వ్యవహరించి భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ముందుండి ప్రజలలో మార్పు తీసుకురావడానికి ఇలాంటి అవగాహన ర్యాలీలు ఎంతో దోహదపడతాయని ఆయన వివరించారు. కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు చేతబూని, పరిశుభ్రత నినాదాలు చేస్తూ వీధుల గుండా ఉత్సాహంగా ముందుకు సాగారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని స్థానికులకు వివరిస్తూ వారు చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి. రమణ, సాసా కోఆర్డినేటర్ శ్రీ ఆర్.ఎన్. రఘురామ్, డాక్టర్ ఎన్. సుజాత తదితరులు కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవగాహన ర్యాలీని విజయవంతం చేశారు.



# రూ.53 కోట్లతో భారీ మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

• శరవేగంగా ఆరీనా-2 పనులు • డిసెంబర్ నాటికి 80 శాతం పూర్తి

• ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి • మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆరీనా-2 పనులు పరిశీలన

**రాజమహేంద్రవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల సమయంలో రాజమహేంద్రవరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మొత్తం రూ.53 కోట్లతో మూడు దశల్లో మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం విఎల్ పురం పాత లారీ స్టాండ్ వద్ద కేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఆరీనా-2) పనులు అనుకున్న టైమ్‌లైన్ కంటే వేగంగా సాగుతున్నాయని చెప్పారు. డిసెంబర్ నాటికి 80 శాతం పనులు పూర్తి చేసి, వచ్చే ఫిబ్రవరిలో ఆరీనా-2ను ప్రారంభించే అవకాశం ఉందని వెల్లడించారు. విఎల్ పురం పాత లారీ స్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఆరీనా-2) నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, అనంతరం మీడియాతో మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేలో ఇండియా నిధుల ద్వారా ఆరీనా-2 నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. తాను, అధికారులు ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందన్నారు. తాము నిర్ణయించుకున్న టైమ్‌లైన్ కంటే కూడా వేగంగా పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. సమీక్ష సందర్భంగా కాంట్రాక్టర్ డిసెంబర్ నాటికి 80 శాతం పనులు పూర్తయ్యే అవకాశం ఉందని, ఫిబ్రవరి నాటికి ఆరీనా-2ను ప్రారంభించవచ్చని చెప్పడం శుభవార్తగా అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు సాకారంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కీలక సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె సహకారంతో కేంద్ర ప్రభుత్వం నుంచి కేలో ఇండియా నిధులు తీసుకువచ్చి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఆరీనా-2తో పాటు మరో రెండు దశల్లో కూడా పనులను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. రూ.28 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించనున్న ఆరీనా-1 ప్రస్తుతం టెండర్ దశలో ఉందన్నారు. బహుశా సెప్టెంబర్ చివరి నాటికి టెండర్లు ఓపెన్ అయ్యి కాంట్రాక్టర్‌ను కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. ఆరీనా-2తో పాటు ఆరీనా-1 పనులను సమాంతరంగా చేపడితే 8 నుంచి 9 నెలల్లో పూర్తి చేసుకునే అవకాశం ఉందని చెప్పారు.అలాగే మూడో దశలో ఆరీనా-3 నిర్మాణానికి కేలో ఇండియా ద్వారా రూ.10 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం వద్ద మంజూరు దశలో ఉన్నాయని తెలిపారు. ఈ నిధుల మంజూరు కోసం ఎంపీ పురందేశ్వరి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. కేలో ఇండియా నుంచి ఆరీనా-3కు నిధులు మంజూరైతే మూడు దశలను కలిపి మొత్తం రూ.53 కోట్లతో నగరంలో భారీ మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో ఇది అతి పెద్దదిగా నిలిచే అవకాశం ఉందని, ఇంత భారీ స్థాయిలో మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రాజమహేంద్రవరంలో నిర్మాణం కావడం నగర ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఒక శాసనసభ్యుడిగా తాను ఇచ్చిన హామీని నెరవేర్చుకుంటుండగా, పార్లమెంట్ సభ్యురాలిగా ఎంపీ పురందేశ్వరి అందిస్తున్న సహకారంతో నగర ప్రజల చిరకాల కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందని తెలిపారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకూడదని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పనులు వేగంగా సాగుతున్నప్పటికీ నాణ్యత విషయంలో ఎటువంటి కాంప్రమైజ్ ఉండకూడదని సూచించామని చెప్పారు. అనుకున్న గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను కోరామని, అధికారులు కూడా నిరంతరం సమీక్షిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు తమకు అత్యంత ప్రాధాన్యత కలిగినదని



స్పష్టం చేశారు. ఆరీనా-1 టెండర్లు కూడా అతి త్వరలో ఓపెన్ కానున్నాయని, అనంతరం అధికారికంగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని నగర ప్రజలకు మరో శుభవార్త అందించారు. ఆరీనా-1, ఆరీనా-2, ఆరీనా-3 మూడు దశలు పూర్తి అయితే రూ.53 కోట్లతో నిర్మితమయ్యే ఈ మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రాజమహేంద్రవరం నగరంతో పాటు ఈ ప్రాంతం రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తుందని అన్నారు.స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సమీపంలో మంచి స్థాయి హోటల్ నిర్మాణం చేపట్టే ఆలోచన కూడా ఉందని ఎమ్మెల్యే వాసు వెల్లడించారు. ఈ మేరకు ప్రముఖ, పేరున్న సంస్థలు, రిప్యూటెడ్ ఆర్గనైజేషన్లతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. హోటల్ కూడా అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం కేవలం క్రీడా కేంద్రంగానే కాకుండా రెవెన్యూ జనరేటింగ్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాజమహేంద్రవరం కోసం మాత్రమే కాకుండా రాష్ట్ర, దక్షిణ భారతదేశ స్థాయి ప్రధాన క్రీడా, ఇతర భారీ కార్యక్రమాలకు కూడా ఈ కాంప్లెక్స్ వేదికగా మారేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో దక్షిణ భారతదేశంలో జరిగే మేజర్ మీట్స్‌కు రాజమహేంద్రవరం ఒక ప్రధాన వేదికగా మారే అవకాశం ఉంటుందన్నారు. విశాలమైన విస్తీర్ణంలో అనేక రకాల మల్టీ పర్పస్ ఈవెంట్లు నిర్వహించే అవకాశం కల్పించాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. ఇలాంటి భారీ కార్యక్రమాలు నగరంలో నిర్వహిస్తే బయటి ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు, ప్రతినిధులు, సందర్శకుల రాకతో నగరంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయన్నారు. హోటళ్లు, హాస్పిటాలిటీ, ఇతర రంగాల ద్వారా రెవెన్యూ జనరేషన్ జరుగుతుందని తెలిపారు. నగరానికి గుర్తింపు, ఆదాయం తీసుకురావాలన్న దూరదృష్టితోనే ఈ ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని చెప్పారు.

### గత ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయింది..?

కాగా గత ప్రభుత్వం ఈ అభివృద్ధి పనులను ఎందుకు చేయలేకపోయింది అని విలేకరులు అడిగిన ప్రశ్నపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించారు. చిత్తశుద్ధి, నిబద్ధత లేని వారి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని వ్యాఖ్యానించారు. ఇటీవల నగరంలో డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయినులను కలిసిన సందర్భంగా వారు చెప్పిన మాటలు తనను కలచివేశాయన్నారు. ఒక మహిళ సిజేరియన్ ఆపరేషన్ జరిగిన రెండు నెలల్లోనే కష్టపడి పరీక్షకు హాజరై ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారని, మరో మహిళ తన తండ్రి మరణించిన మూడు నెలలకే ఉద్యోగం సాధించారని తెలిపారు. వ్యక్తిగతంగా ఎన్నో బాధలను దిగమింగుకుని, తీవ్రంగా శ్రమించి ఉద్యోగాలు సాధించిన వారిని వైఎస్సార్సీపీ నాయకులు దొడ్డిదారిన ఉద్యోగాలు సాధించారని అనడం బాధాకరమని ఆ ఉపాధ్యాయులు తనతో ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల బాధ కలుగుతోందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారన్నారు.

## 24 నుంచి ఆర్యాపురంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్యాపురం శ్రీ కృష్ణ చైతన్య మిషన్ అండ్ ఆశ్రమం శ్రీ గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో ఈనెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆశ్రమ ఇన్‌చార్జ్ హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. 24వ తేదీ సోమవారం నుంచి సెప్టెంబర్ 3వ తేదీ గురువారం వరకు ప్రతీరోజు సాయంత్రం 6 గంటలకు శ్రీ రాధాకృష్ణుల ఊయల ఉత్సవం, 24వ తేదీ సోమవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పవిత్రా రోహిణీ ఏకాదశి సందర్భంగా హరినామ సంకీర్తన, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ చే ఊయల లీలా విశిష్టతపై ఉపన్యాసం జరుగుతుందని వివరించారు. 25 నుంచి 3వ తేదీ వరకు శ్రీమద్ భాగవత ఉపన్యాసం భాగవతాచార్యుల వారిచే జరుగుతుందని, 28న శుక్రవారం బలరామ జయంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు గోపూజ, 30న ఆదివారం భగవద్గీత పోటీలు, 2వ తేదీ బుధవారం సాయంత్రం 7 గంటలకు శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా భాగవత పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతి ప్రధానోత్సవం ఉంటుందన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని హరిదాస్ బ్రహ్మచారి కోరారు.

మహనీయుల చరిత్ర నేటి యువతకు

## స్ఫూర్తిదాయకం : దేవత సుధాకర్

సిటీ ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు




**రాజమహేంద్రవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల స్థాయి నుండీ దేశం కోసం పోరాడిన మహనీయుల గురించి తెలుసుకోవాలని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి దేవత సుధాకర్ విద్యార్థులకు హితవు పలికారు. రేపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్బంగా స్థానిక వంకాయల వారి వీధిలోని సిటీ మునిసిపల్ హై స్కూల్ నందు పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, ప్రకాశం పంతులు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులకు ఆంధ్రకేసరి జీవితచరిత్ర పుస్తకాలు అందచేశారు.సభ్యులు పరమ హంసరాజు మాట్లాడుతూ 1928లో మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటిష్ పోలీసుల కాల్పులను ఎదుర్కొంటూ “నా గుండె ఇక్కడ ఉంది, కాల్చండి చూద్దాం” అంటూ ముందుకు నడిచి ‘ఆంధ్రకేసరి’గా ప్రఖ్యాతి పొందారన్నారు. ముఖ్యమంత్రి గా పనిచేసినా అతి నిరాడంబరం గా జీవనాన్ని సాగించిన మహనీయులు ప్రకాశం పంతులు అన్నారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్ర పై విద్యార్థులకుపోటీలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ ను కోరారు. ఈ కార్యక్రమం లో దేవత సుధాకర్, శేషు బాబు, వెంకట రామరాజు, గువ్వల వెంకటేశ్వర రావు, కడియాల వీరభద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్ఆర్ సిఐ సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం

రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కారి దాసు



**రాజమహేంద్రవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో శనివారం హెచ్ఆర్‌సీఐ (హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కారి దాసు పుట్టిన రోజు వేడుకలను సేవా కార్యక్రమా లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని సుమారు 300 మంది చిన్నారులకు అల్పాహారం అందించి, వారితో కొంతసేపు ఆత్మీయంగా గడి పారు. ఈ సందర్భంగా డాక్టర్ కారి దాసు మాట్లాడుతూ.. పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాలను వ్యక్తిగత వేడుకలకే పరిమితం చేయకుండా, సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలిచే విధంగా నిర్వహించు కోవడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. చిన్నారులతో కలిసి పుట్టినరోజు జరుపుకోవడం తనకు ఎంతో ఆనం దాన్ని, మానసిక సంతృప్తిని కలిగించిందని తెలిపారు. మానవత్వమే హెచ్ఆర్‌సీఐ ప్రధాన లక్ష్యమని, రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వ హిస్తున్నామని చెప్పారు. వృద్ధులకు పెన్షన్లు అందించడం, అనాథ మరియు నిరుపేద పిల్లలకు విద్యాభ్యాసానికి సహకారం అందించడం, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, అవసరమైన వారికి నిత్యావసర వస్తువులు అందిం చడం వంటి పలు కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. సమా జంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వా ములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా చిన్నారుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు కోసంసమాజం మరింత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రియదర్శిని ఆశ్రమంలోని చిన్నారుల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, భవిష్యత్తులో కూడా హెచ్ఆర్‌సీఐ తరఫున వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులకు అల్పాహారం అందించడంతో పాటు వారితో ఆత్మీయంగా గడపడం ద్వారా పుట్టినరోజును ప్రత్యేకంగా జరుపుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని డాక్టర్ కారి దాసు ఆనందం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవతా విలువలను మరింత పెంపొందించేందుకు హెచ్ఆర్‌సీఐ కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌సీఐ జిల్లా అధ్యక్షులు చైతన్య, జిల్లా యూత్ అధ్యక్షులు కే. ప్రదీప్, వెంకట్రావు, సతీష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి దారికి అడ్డుగా ఆక్రమణలు..
## అధికారులు స్పందించాలి

తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నాయని బాధితుడి వెల్లడి..
నకిలీ పత్రాలతో స్థలం ఆక్రమించారని ఆరోపణ



**గోకవరం, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** తన ఇంటికి వెళ్లే మార్గంగా ఉన్న అసలు మినహా స్థలం ఆక్రమణకు గురైందని, వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణను తొలగించి తన ఇంటికి దారి మార్గాన్ని చూపించాలని తంటికొండ గ్రామానికి చెందిన బద్దిరెడ్డి రాంబాబు కోరారు. శనివారం ఆయన మీడియాకు తన సమస్యను వివరించారు. రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తంటికొండ గ్రామంలోని 3.86 ఎకరాల మంచినీటి చెరువుకు సంబంధించిన అసలు మినహా స్థలంలో నుంచి తన ఇంటికి వెళ్లేందుకు మార్గం ఉండేది. అయితే తన ఇంటికి మార్గం లేదంటూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 2012లో కోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ వ్యవహారంలో 2017లో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అనంతరం రిట్ పిటిషన్ దాఖలు చేయగా 2026 ఏప్రిల్‌లోనూ సదరు వ్యక్తికి వ్యతిరేకంగానే తీర్పు వెలువడిందని రాంబాబు పేర్కొన్నారు. అయితే కోర్టు తీర్పు సదరు వ్యక్తికి అనుకూలంగా వచ్చిందంటూ అధికారులు తనకు చెప్పారని ఆయన ఆరోపించారు. అనంతరం పోలీసుల రక్షణతో సదరు వ్యక్తి అసలు మినహా స్థలంలో మెస్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రభుత్వ స్థలానికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణకు పాల్పడ్డారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని రాంబాబు తెలిపారు. ఈ వ్యవహారంపై అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ జరిపి, రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. ఇకనైనా అధికారులు స్పందించి అసలు మినహా స్థలాన్ని సర్వే చేసి, ఆక్రమణ నిజమైతే వెంటనే తొలగించి తన ఇంటికి ఉన్న పాత దారి మార్గాన్ని పునరుద్ధరించాలని బద్దిరెడ్డి రాంబాబు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## పోక్సోపై అవగాహన తప్పనిసరి

వేధింపులను ఉపేక్షించొద్దు.. వెంటనే సమాచారం ఇవ్వాలి



**రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 22, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవళేశ్వరంలో బాలికల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జువెనైల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ ఎన్. రెడ్డి ప్రసన్న, ధవళేశ్వరం ఎస్సై బి.హరిబాబు సూచించారు. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలెక్టరేట్ వెనుక ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాలల చట్టాలు, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేధింపులు ఎదురైతే మౌనం వద్దు.. భయపడొద్దు అని సూచించారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఈవ్‌టీజింగ్, ఇతర వేధింపులపై వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. చదువుకునే దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి వంటి మత్తు పదార్థాల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పీర్ ప్రెజర్‌కు లోనై తప్పుదారి పట్టవద్దని, వ్యక్తిగత భద్రత, పరిశుభ్రత, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని న్యాయమూర్తి, ఎస్సై సూచించారు. విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించేందుకు వెనుకాడాల్సిన అవసరం లేదని ఎస్సై హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థినులకు చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు.




## లాస్ట్ సినిమా టోటల్ వసూళ్లను తొలిరోజే లేపేసిన రవితేజ



మాస్ రాజా రవితేజకు సరైన కంటెంట్ తోడైతే బాక్సాఫీస్ వద్ద విజృంభణ ఏ రేంజ్‌లో ఉంటుందో 'ఇరుముడి' నిరూపిస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఏపీ, తెలంగాణల్లోని బిగ్ సిటీస్ నుంచి బి, సి సెంటర్ల వరకు ప్రతి చోటా హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తుండటంతో, కేవలం మొదటి వీకెండ్‌లోనే బయ్యర్లు లాభాల బాట పట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ట్రేడ్ వర్గాలను సైతం విస్మయానికి గురిచేస్తూ ఈ చిత్రం తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 24 కోట్ల గ్రాస్ సాధించినట్లు తెలుస్తోంది. రవితేజ గత చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' టోటల్ రన్ కలెక్షన్లను 'ఇరుముడి' ఒక్క రోజే దాటేయడం గమనార్హం. సాధారణ మాస్ చిత్రాలకు భిన్నంగా ఆకట్టుకునే ఎమోషన్స్, బలమైన కథనం, ముఖ్యంగా అయ్యప్ప స్వామి సెంటిమెంట్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం రవితేజ కెరీర్‌లోనే మరో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచే దిశగా దూసుకుపోతోంది.

## నార్త్.. సౌత్.. అనే గొడవ వద్దు.. రాకింగ్ స్టార్ యశ్ స్పీచ్..



యశ్ టాక్సిక్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నార్త్-సౌత్ విభజనను వ్యతిరేకించారు. దేశంలో ఎక్కడైనా కష్టపడితే ప్రేమ దక్కుతుందని, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్టీమ్‌బోట్ కథ ద్వారా ఎగతాళి చేసే వారి మాటలను పట్టించుకోకుండా, లక్ష్యం వైపు సాగితే విజయం సాధిస్తారని యువతకు స్ఫూర్తినిచ్చారు. ఆయన అనుభవంతో ఈ సందేశాన్ని పంచుకున్నారు. హీరో యశ్ తన తాజా చిత్రం టాక్సిక్ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ప్రసంగిస్తూ, దేశంలోని నార్త్-సౌత్ విభజనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని అందించారు. "ఇండియన్ సిస్టంలో చాలా రాష్ట్రాలు ఉన్నాయి. అందరికీ తమ భాష అంటే చాలా ప్రేమ. అయితే, ప్రస్తుతం అందరూ కలిసి రావాల్సిన సమయం ఆసన్నమైంది" అని యశ్ స్పష్టం చేశారు. ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూసే వారిని, లేదా ఈ అంశంపై రాజకీయాలు చేయాలనుకునే వారిని ఎవరూ పట్టించుకోవద్దని ఆయన ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను కోరారు. "మీరు కష్టపడితే, మన దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా అదే ప్రేమ దొరుకుతుంది. మన దేశంలో ఎక్కడ నుంచి ఎవరైనా వచ్చి మంచి పని చేసినా, అంతే ప్రేమ మీరు ఇస్తారు. ఆ నమ్మకం నాకు ఉంది" అని యశ్ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఈ మాటలు ప్రాంతీయ భేదాలను పక్కన పెట్టి మానవత్వాన్ని, కృషిని గౌరవించాలని సూచిస్తాయి. తన సందేశానికి మరింత బలం చేకూర్చేందుకు, యశ్ ఒక చిన్న స్ఫూర్తిదాయక కథను పంచుకున్నారు. మొట్టమొదట స్టీమ్‌బోట్ ఇంజిన్‌ను ఆవిష్కరించినప్పుడు జరిగిన సంఘటనను ఆయన వివరించారు. "ఫస్ట్ టైం ఎవరో ఒక స్టీమ్‌బోట్ ఇంజిన్ ఇన్వెంట్ చేసినప్పుడు, దే వాంటెడ్ టు షో ఇట్ టు ది హోల్ వరల్డ్ అంట. అప్పుడు అక్కడ ఉన్న సిటీలో ఎవ్రీబడీ వెంట్ టు విట్నెస్ ఇట్. కానీ విట్నెస్ చేసే వెళ్లే మనిషి అందరూ ఏం చెప్పారంట, అరే ఇది ఎలా జరుగుతుంది రా. ఇది ఎలా జరగొచ్చు. ఏదో స్టీమ్ అంట. ఆ స్టీమ్ తో బోట్ ముందు పోతుంది అని. థిస్ విల్ నెవర్ హ్యాపెన్ అని మాట్లాడుతూ దే వర్ స్పీకింగ్ అబౌట్ ఇట్" అని యశ్ వివరించారు. ప్రజలు స్టీమ్‌బోట్‌ను అనుమానించినా, అది మొదలైందని, ముందుకు కదిలిందని ఆయన గుర్తు చేశారు. "స్టార్ట్ అవ్వలేదురా, స్టార్ట్ అయ్యే ఛాన్సే లేదు అన్నవారు, అది స్టార్ట్ అయ్యాక నోరు మూయలేదు. మూవ్ అవ్వదు అన్నవారు, అది కదిలాక కూడా తమ మాట మార్చుకోలేదు. అది ఆగిపోదు, ఎక్కడో క్రాష్ అవుతుంది, మునిగిపోతుంది అన్నారు" అని యశ్ చెప్పగా, ప్రేక్షకులు ఆలోచనలో పడ్డారు. "సో, వాట్ ఐ యామ్ ట్రైయింగ్ టు టెల్ ఈజ్, లైఫ్‌లో, ఇన్ లైఫ్ మీరేం చేసేకి వెళ్లినా, ఇలాగే మాట్లాడేవాడు మాట్లాడుతూనే ఉంటారు. డోంట్ లిజన్ టు ఎనీబడీ. కీప్ గోయింగ్. సక్సెస్ విల్ బీ యువర్స్. విత్ మై ఎక్స్పీరియన్స్, ఐ హేవ్ రియలైజ్డ్ దట్. సో, ఐ వుడ్ లవ్ టు షేర్ దట్ విత్ యు" అని యశ్ తన వ్యక్తిగత అనుభవాన్ని జోడించి యువతకు సందేశమిచ్చారు. జీవితంలో ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలను పట్టించుకోకుండా, తమ లక్ష్యం వైపు దృఢంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందేశం సినీ రంగంలో, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు స్ఫూర్తినిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్ హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగింది.

## నా దృష్టిలో ఎప్పటికీ ఆయనే అసలైన హీరో..




మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు నేడు (ఆగస్ట్ 22). ఈ సందర్భంగా ఆయనకు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన తమ్ముడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన చిన్ననాటి జ్ఞాపకాలు పంచుకుంటూ ఎమోషనల్ ట్వీట్ చేశారు. తన అన్నయ్యతో తనకున్న అనుబంధం గురించి సుదీర్ఘ ట్వీట్ చేశారు.మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు నేడు (ఆగస్ట్ 22). సినీరంగంలో మెగా అభిమానులకు ఈరోజు పండగ వాతావరణమనే చెప్పాలి. ఈ సందర్భంగా ఆయనకు సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అలాగే ఆయన తమ్ముడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం చిరుతో తనకున్న అనుబంధం, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సుదీర్ఘ ట్వీట్ చేశారు. అలాగే చిన్నప్పటి ఫోటోస్, స్పెషల్ వీడియో షేర్ చేస్తూ తనకు ప్రాణమైన అన్నయ్యకు బర్త్ డే విషెస్ చెప్పారు. " అన్నయ్య గురించి ఆలోచించడం ఎప్పుడూ నాకు అమితమైన ఆనందానని ఇస్తుంది. ఆయన నర్సాపూర్ కాలేజీ చదువుకునే రోజుల్లో వేసవి సెలవులకు ఇంటికి వస్తే మా ఇంట్లో పండగ వాతావరణం ఉండేది. సెలవులు ముగిసి ఆయన మళ్లీ కాలేజీకి వెళ్తుంటే ఇల్లంతా బోసిపోయినట్లు ఉండేది. ఆయన పక్కన నడుస్తుంటే ప్రపంచంలోఅత్యంత ముఖ్యమైన వ్యక్తితో కలిసి నడుస్తున్నట్లు అనిపించేది. ఆయనను అభిమానంతో ఆరాధించేవాడిని. వెండితెరపై హీరో కాకముందే నా దృష్టిలో ఆయనే అసలైన హీరో"అంటూ రాసుకొచ్చారు. అన్నయ్య పెళ్లయినప్పుడు ఆయన మాకు దూరమైపోతారేమోనని ఒక గదిలో కూర్చుని ఏడుస్తుంటే.. వదినను నా దగ్గరకు తీసుకొచ్చి రా ఈరోజు నీకో పెద్ద మనిషిని పరిచయం చేస్తాను అంటూ నన్ను ఆటపట్టించాడు. నా ఏడుపుకు కారణం తెలిసి ఇద్దరూ నవ్వుకున్నారు. తర్వాత నన్ను మద్రాసుకు తీసుకెళ్లి వారు చూపించిన ప్రేమ మాటల్లో చెప్పలేను. మద్రాసు ఎండల్లో ఉక్కపోతలో 18 గంటలపాటు కష్టపడి చెమటతో తడిసిన దుస్తులతో అర్ధరాత్రి నిలబడే ఓపిక కూడా లేని స్థితిలో ఆయన ఇంటికి రావడం నేను చూశాను. ఆయన త్యాగాల మీద బతుకుతున్నందుకు ఎంతో గిల్టీగా ఫీలయ్యేవాడిని. కానీ నేను చదువులో విఫలమైనా.. నా జీవితానికి సరైన దిశ లేకపోయినా ఏనాడు ఒక్కమాట అనలేదు. అందరికి మెగాస్టార్ అయినా.. నాకు మాత్రం ఎప్పటికీ ఏకైక హీరో. నా ప్రియమైన అన్నయ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ రాసుకొచ్చారు.. పవన్ కళ్యాణ్ ట్వీట్ కు మెగాస్టార్ చిరంజీవి సైతం రిప్లై ఇచ్చారు. "ప్రియమైన కళ్యాణ్ బాబూ, నీ మాటలు మన జీవితంలోని అత్యంత మధురమైన ఘట్టాలను నాకు గుర్తుచేసి, నన్ను ఎంతో భావోద్వేగానికి గురిచేశాయి. నా ప్రేమ మరియు త్యాగంగా నువ్వు భావించేవి, నిజానికి నీ అన్నయ్యగా నా బాధ్యత మరియు అనురాగం మాత్రమే. ఈ రోజు నీ అచంచలమైన ధైర్యం, ప్రజల పట్ల నీకున్న అంకితభావం మరియు మన భారత్ పట్ల నీకున్న ప్రేమను చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉంది. నువ్వు లక్షలాది మందికి శక్తికి మరియు స్ఫూర్తికి నిలయంగా మారావు. నువ్వు నన్ను నీ 'హీరో' అని పిలుస్తావు, కానీ నీ దృఢ సంకల్పం, నిజాయితీ మరియు నిస్వార్థ ప్రయాణం నన్ను కూడా ఎన్నో విధాలుగా ప్రభావితం చేశాయి. జ్ఞాపకాల రూపంలో ఈ అందమైన కానుకను అందించినందుకు ధన్యవాదాలు కళ్యాణ్ బాబూ. నీ ప్రేమే నా జీవితంలో లభించిన గొప్ప వరాలలో ఒకటి. ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను" అంటూ ట్వీట్ చేశారు.

క్రీడా వాయిస్ – మీ క్రీడా వార్తల స్వరము

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

## గాయత్రి గోపీచంద్-ట్రీసా జోడీకి కాంస్యం



ఇటీవలే అర్జున పురస్కారాలకు ఎంపికైన భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్స్‌లో గాయత్రి జోడీ 21-18, 13-21, 8-21తో లియు షెంగ్షు, టాన్ నింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ పోరాడి గెలిచిన భారత ద్వయం తర్వాత రెండు గేమ్‌లను చేజార్చుకుంది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్ ఆరంభంలో భారత జోడీ 4-1 ఆధిక్యంలో నిలిచింది. తర్వాత చైనా ద్వయం దూకుడుగా ఆడి 7-7తో స్కోరును సమం చేసింది. తర్వాత పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. ఈ క్రమంలో ట్రీసా, గాయత్రి 16-18తో వెనుకబడినా.. గొప్పగా పుంజుకుని గేమ్‌ను గెల్చుకున్నారు. రెండో గేమ్‌లో చైనా జోడీ దూకుడు ప్రదర్శించి 5-2తో నిలిచినా భారత జోడీ పుంజుకుని 11-10తో ఆధిక్యంలోని నిలిచింది. తర్వాత లియు షెంగ్షు, టాన్ నింగ్ దూకుడు పెంచి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హవా అంతా చైనా జోడీదే. భారత ద్వయం కనీస పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో ట్రీసా, గాయత్రి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు.

## హాకీ వరల్డ్ కప్.. కీలక మ్యాచ్‌లో భారత్ ఓటమి



హాకీ ప్రపంచకప్‌లో రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టిన భారత పురుషుల జట్టు శనివారం పూల్-ఈలో భాగంగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమిపాలైంది. ఈ కీలక మ్యాచ్‌లో భారత్ 1-3తో పరాజయం చవిచూసింది. మ్యాచ్‌లో భారత జట్టే అధిక సమయం బంతిని తన అధీనంలో ఉంచుకున్నప్పటికీ గోల్స్ చేయడంలో విఫలమైంది. మొదటి రెండు క్వార్టర్లలో ఇరుజట్లూ గోల్స్ చేయలేదు. రెండో అర్ధ భాగంలో నెదర్లాండ్స్ మూడు గోల్స్ చేసింది. డూకో టెల్జెన్‌క్యాంప్ (41వ నిమిషం), జెప్ హ్యోడెమేకర్స్ (51వ నిమిషం), థిజ్స్ వాన్ డామ్ (55వ నిమిషం) గోల్స్ సాధించారు. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (52వ) పెనాల్టీ కార్నర్‌తో గోల్ చేశాడు. ఈ ఓటమితో భారత్ సెమీస్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. హర్మన్‌ప్రీత్ సేన సెమీ ఫైనల్‌కు చేరాలంటే తదుపరి మ్యాచ్‌లో అర్జెంటీనాపై భారీ తేడాతో విజయం సాధించాల్సి ఉంటుంది. అంతేకాదు ఇతర జట్ల ఫలితాలు కలిసివస్తేనే భారత్ ముందంజ వేస్తుంది.

ర్యాంకులు కాదు..

## నాకు ట్రోఫీలే ముఖ్యం : గౌతమ్ గంభీర్



శ్రీలంకతో రెండో టెస్టు కోసం టీమ్‌ఇండియా సన్నద్ధమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా మ్యాచ్ మొదలుకానుంది. తొలి టెస్టులో భారీ విజయంతో భారత్ ఉత్సాహంగా ఉంది. రెండో మ్యాచ్‌నూ గెలిచి క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. ఈ క్రమంలో భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. గతంలో ఎదురైన పరాభవాల గురించి ఎక్కువగా ఆలోచించనక్కర్లేదని.. జట్టు సరైన మార్గంలోనే ఉన్నట్లు స్పష్టం చేశాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ ఇబ్బంది పడుతోందనే వాదనను కొట్టిపడేశాడు. "మేం ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. కొన్ని మ్యాచుల్లో ఫలితాలు అనుకూలంగా రానంత మాత్రాన జట్టు పతనమైనట్లు కాదు. ఇదంతా ట్రాన్సిషన్‌లో భాగం. ర్యాంకుల గురించి మేం పట్టించుకోం. గత ఇంగ్లాండ్ పర్యటన నుంచి మంచి టెస్టు క్రికెట్‌నే ఆడుతున్నాం. ప్రధాన కోచ్‌గా నా పని ట్రోఫీలను గెలవడం. నేను నమ్మేదీ అదే. దాని గురించే ఆలోచిస్తా" అని గంభీర్ స్పష్టం చేశాడు.

**కుల్‌దీప్ బౌలింగ్‌పై..**

"ఎప్పుడైనా సరే మ్యాచ్‌లో 20 వికెట్లను పడగొట్టేందుకు చూస్తాం. అలాంటి అత్యుత్తమ బౌలింగ్ ఎటాక్‌తో బరిలోకి దిగుతాం. కుల్‌దీప్ యాదవ్ మంచి బౌలర్. అందులో ఎలాంటి సందేహం లేదు. తుది జట్టు ఎంపికపై కొన్నిసార్లు కెప్టెన్ నిర్ణయం కూడా ఆధారపడి ఉంటుంది. క్రికెట్‌లో ఒడుదొడుకులు సహజం. మా ప్లేయర్లకు మేం మద్దతుగా ఉంటాం. ఒకటి లేదా రెండు మ్యాచుల ప్రదర్శన ఆధారంగా నిర్ణయాలు తీసుకోం"

**మూడు టెస్టుల సిరీస్ అయితే..**

"శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్నాం. అయితే, నేను మూడు టెస్టుల సిరీస్ నిర్వహణకే మొగ్గు చూపిస్తా. అందుకోసం ఎలా సిద్ధమవ్వాలో ఆటగాళ్లుగా మాకు తెలుసు. అవసరమైతే ప్రాక్టీస్ సెషన్‌లను ఆప్షనల్ చేస్తాం. బౌలర్లకు ఎక్కువగా విశ్రాంతి ఇస్తాం. ఇక గాలె మైదానం మంచి టెస్టు పిచ్. అక్కడ ఆటను ఆస్వాదించాం. కొలంబోలోనూ ఇలానే ఉంటుందని భావిస్తున్నా" అని గంభీర్ తెలిపాడు.

ఉసేన్ బోల్ట్‌ను మించిన వేగం.. ప్రపంచ రికార్డు బ్రేక్ ఉసేన్ బోల్ట్‌ను మించిన వేగం..

## ప్రపంచ రికార్డు బ్రేక్ చేసిన రోబో



పనిలోనూ, ఆలోచనా విధానంలోనూ మనుషులకు తామేం తక్కువ కాదని ఇప్పటికే కొన్ని హ్యుమనాయిడ్ రోబోలు నిరూపించాయి. తాజాగా పరుగు పందెం పోటీలోనూ అవి సత్తాచాటుతున్నాయి. ఇప్పుడు ఏకంగా పరుగుల యోధుడు.. ట్రాక్‌పై చిరుతలా పరుగెత్తుతూ రికార్డుల మోత మోగించిన ఉసేన్ బోల్ట్ నెలకొల్పిన ప్రపంచ రికార్డును ఓ హ్యూమనాయిడ్ రోబో బద్దలు కొట్టింది. చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ హానర్ అభివృద్ధి చేసిన లైటినింగ్ అనే హ్యూమనాయిడ్ రోబో 100 మీటర్ల పరుగును 9.32 సెకన్లలో పూర్తి చేసింది. జమైకా స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ 2009 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో 9.58 సెకన్లలోనే 100 మీటర్ల రేసు పూర్తి చేసి వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు దానిని 'లైటినింగ్' అధిగమించింది. హ్యూమనాయిడ్ రోబోల తయారీ, అభివృద్ధిలో చైనా దూసుకుపోతోంది. ఇదే ఏడాది ఏప్రిల్‌లో జరిగిన 21 కిలోమీటర్ల బీజింగ్ హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఇందులో సుమారు 12 వేల మంది మనుషులు, 100కు పైగా హ్యూమనాయిడ్ రోబోలు పోటీ పడ్డాయి. ఈ క్రమంలో 21 కిలోమీటర్ల దూరాన్ని 50 నిమిషాల 26 సెకన్లలో లైటినింగ్ రోబో పూర్తి చేసి రికార్డు నెలకొల్పింది. మరో రోబో 51 నిమిషాల్లో, ఇంకో రోబో 53 నిమిషాల్లో తమ పరుగును పూర్తి చేసి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com